క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దిరాల : మండలంలోని రెడ్డిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో గల మద్దిరాల ఎక్స్‌రోడ్డు, కుంటపల్లి గ్రామాలకు సంబంధించిన 11కేవీ విద్యుత్ వైర్ల మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు ఆ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ ఏఈ రమేష్ బుధవారం తెలిపారు. అందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మండల కోఆర్డినేటర్‌గా ఎర్ర యాదగిరి



తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలోని తాటిపాముల గ్రామానికి చెందిన ఎర్ర యాదగిరి జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ అభియాన్ మండల కమిటీ కోఆర్డినేటర్‌గా బుధవారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే మందుల సామేల్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, మండల శాఖ అధ్యక్షుడు ఎల్సోజు నరేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ జమ్మిలాల్, అంబేద్కర్ తదితరులున్నారు.

కేజీబీవీ పాఠశాల తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ప్రత్యేకాధికారి జగదీశ్వర్‌రెడ్డి

చివ్వెంల : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ ఆశ్రమ పాఠశాలను బుధవారం మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్‌రెడ్డి అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగది, తరగతి గదులు పరిశీలించారు. అనంతరం విద్యార్థులను మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ సంతోష్‌కుమార్, ఎస్ఓ నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ హరిప్రసాద్

తిరుమలగిరి : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ బి.హరిప్రసాద్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌కె.జాన్‌మహ్మద్, సర్వేయర్ జోసఫ్, ఆర్ఐ సుజీత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కోలాట బృందానికి రూ.25వేల ఆర్థికసాయం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో నూతనంగా కోలాట నేర్చుకున్న బృందానికి చీరల కోసం డీసీసీ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానందచారి బుధవారం రూ.25వేలు ఆర్థికసాయం అందజేశారు. గ్రామీణ కళలను కాపాడాలని మహిళలను ఆయన కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు నర్సింగ కృష్ణమూర్తి, దేవస్థాన ధర్మకర్త జె.సోమయ్య, ఎల్లంల కొమిరెల్లి, సత్తిరెడ్డి, కుంభం రణధీర్, రమేష్, ఆకారపు శ్రీను, దాసరి బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోట దగ్ధం

నూతనకల్ : మండలంలోని ఎర్రపహాడ్‌లో ప్రమాదవశాత్తు మామిడి తోట దగ్ధమైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొలిచెల్మ సోమలింగయ్య, శ్రీనివాస్, ఉపేందర్‌కు చెందిన మామిడి తోట పక్కన రైతు కొండ్ర రాములు పత్తి కట్టెకు నిప్పుపెట్టడంతో ప్రమాదవశాత్తు మామిడి తోటకు అంటుకొని 65చెట్లు పూర్తిగా కాలిపోయాయి. దగ్ధమైన మామిడి తోటను మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడారు. అధికారులకు తెలియజేసి నష్టపరిహారం అందే విధంగా చూస్తామని అన్నారు. వారి వెంట యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పసుల అశోక్‌యాదవ్, గుగులోతు కృష్ణ, గాజుల వెంకటయ్య, తొనుకునూరి సైదులుగౌడ్, లింగాల రామచంద్రు, గుండా సోమయ్య, లింగాల వెంకన్న, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంప్ సీజ్

తిరుమలగిరి : మండల పరిధిలోని ఈదులపర్రెతండాలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను సీజ్ చేసినట్లు ఆర్ఐ జి.జార్జిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఇసుక డంప్‌ను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలించొద్దని తెలిపారు. తరలిస్తే కేసులు నమోదవుతాయని హెచ్చరించారు.

బ్రిడ్జి నిర్మాణ పనులకు మోక్షం

- రూ.2.10కోట్లతో తూర్పుతండాకు బీటీ, బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు
- బీటీరోడ్డు నిర్మించిన ఏడాదికి బ్రిడ్జి పనులు ప్రారంభించిన అధికారులు
- తీరనున్న వివిధ గ్రామాల ప్రజల ఇబ్బందులు

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామ పంచాయతీ ఆవాసం తూర్పుతండాకు ఏడాది కిందట బీటీ రోడ్డు నిర్మించారు. అయితే ఈ గ్రామానికి వెళ్లే మార్గంలో గ్రామచెరువుకు వెళ్లే వాగు రోడ్డుపై ప్రవహిస్తుంటుంది. బీటీరోడ్డు నిర్మాణంలో భాగంగా ఆ వాగుపై బ్రిడ్జి ఏర్పాటు చేయాల్సి ఉంది. కాని అధికారులు అవేవి పట్టించుకోకుండా కేవలం బీటీ రోడ్డు చేసి వదిలేశారు. దీంతో వర్షాకాలంలో వాగు పొంగినప్పుడు ఈ రహదారిపై రాకపోకలు నిలిచిపోయి ఈ తండాతో పాటు కాసర్లపహాడ్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాగు పొంగినన్ని రోజులు పూర్తిగా రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ విషయమై సాక్షిలో పలుమార్లు కథనాలు సైతం ప్రచురించారు. అందులో భాగంగా రోడ్డు వేశారు.. బ్రిడ్జి మరిచారు అనే శీర్షికన కథనం ప్రచురించగా ఎట్టకేలకు అధికారులు స్పందించారు. తాజాగా కాసర్లపహాడ్ శివారులో చెరువు అలుగు వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ బ్రిడ్జి నిర్మాణం జరిగితే తండాతో పాటు కాసర్లపహాడ్ గ్రామప్రజల ఇబ్బందులు తీరనున్నాయి.



బ్రిడ్జి లేక వాగులో నుంచి రాకపోకలు సాగిస్తున్న ప్రజలు (ఫైల్)

రూ.2.10కోట్లతో బీటీ నిర్మాణం..

గతంలో ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధులు రూ. 2.10కోట్లతో కాసర్లపహాడ్ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి తండా వరకు ఏడాది కిందట 3కిలోమీటర్ల పొడవున ఫార్మేషన్ రోడ్డును బీటీగా మార్చారు. కాని అప్పట్లో బ్రిడ్జి నిర్మాణం చేపట్టలేదు. కాగా ప్రస్తుతం బ్రిడ్జి పనులు మొదలయ్యాయి. అధికారులు ఈ పనులను త్వరగా పూర్తి చేసి తమ సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పనులు ప్రారంభించడం సంతోషంగా ఉంది



మాతండాకు బీటీ రోడ్డును నిర్మించి ఏడాది దాటింది. అప్పటి నుంచి బ్రిడ్జి నిర్మాణం జరగలేదు. వాగు పొంగినప్పుడల్లా తండాకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప్రస్తుతం పనులు ప్రారంభించడం సంతోషంగా ఉంది.

– కేతావత్ సైదులు, విద్యార్థి

పనులు త్వరగా పూర్తిచేయాలి



తూర్పుతండాకు గతంలో బీటీరోడ్డు నిర్మించారు. అప్పుడు గ్రామానికి వెళ్లే మార్గంలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సి ఉండగా చేపట్టలేదు. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నాం. పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

– ధరావత్ రమేష్, తూర్పుతండా

యువత మత్తుపదార్థాలకు బానిసకావొద్దు

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : యువతకు చాలా భవిష్యత్ ఉందని, మత్తు పదార్థాలకు బానిస కావొద్దని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో నార్కోటిక్ కో ఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సీఓఆర్‌డీ-ఎన్‌కార్డు)పై ఎస్పీ నరసింహతో కలిసి ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై సూర్యాపేట, కోదాడలోని కళాశాలల్లో యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో రూపొందిన పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ డీఎస్పీ భిక్షపతిరావు, డీటీఓ సురేష్‌కుమార్, డీఈఓ అశోక్, డీఐఈఓ భానునాయక్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ సురేందర్, సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, అధికారులు ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నర్సింహ తదితరులు

‘భూ భారతి’పై కళాకారుల అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు

నూతనకల్ : మండల పరిధిలోని టీక్యాతండాలో భూ భారతి పోర్టల్‌పై సాంస్కృతిక సారధి కళాబృందం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారధి జిల్లా టీమ్ లీడర్ పాలకుర్తి శ్రీకాంత్, వెన్నెల నాగరాజు, సైదులు, గడ్డం ఉదయ్, మాగి శంకర్, శిరపంగ రాధ, మద్దిరాల మంజుల, స్రవంతి పాల్గొన్నారు.

19న అవగాహన సదస్సు

తిరుమలగిరి : మండల కేంద్రంలో ఈ నెల 19న భూ భారతి పోర్టల్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బి.హరిప్రసాద్ బుధవారం తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు కలెక్టర్ హాజరవుతారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- ఎస్పీ నర్సింహ

నూతనకల్ : చట్టాలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్పీ కె.నర్సింహ అన్నారు. మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన పోలీసు ప్రజాభరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీవితంలో తప్పటడుగులు వేసే వ్యక్తులు వాటిని సరిదిద్దుకోవడం చాలా కష్టమవుతుందన్నారు. ప్రతిఒక్కరి జీవితం ఉన్నతస్థానంలో నిలబడడానికి విద్యే ప్రధాన కారణమని, ప్రతిఒక్కరూ విద్యపై శ్రద్ధకనబర్చాలని ఆయన సూచించారు. క్షణికావేశంలో తప్పులు చేసి నేరాలకు పాల్పడితే జీవితకాలం శిక్షలు అనుభవించాల్సి వస్తుందన్నారు. గ్రామాల్లో ఏర్పడిన సమస్యలను పెద్ద మనుషుల సమక్షంలో గాని చట్టరీత్యా పరిష్కరించుకోవాలి తప్పా ఘర్షణకు పాల్పడవద్దన్నారు. సీబీఐ, సీఐడీ, ఈడీ, పోలీసు అధికారులమని నమ్మబలికే వారి మాటలకు మోసపోరాదని డిజిటల్ అరెస్ట్ అనేది అబద్ధమని ఆయన తెలిపారు. రోడ్డు ప్రమాదాల భారిన పడకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిసకాకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో తుంగతుర్తి సీఐ నర్సింహరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణరావు, మద్దిరాల ఎస్ఐ వీరన్న, గ్రామపెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ చట్టానికి లోబడి ఉండాలి

సూర్యాపేటటౌన్ : ప్రతిఒక్కరూ చట్టానికి లోబడి ఉండాలని ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని తాళ్లగడ్డలో పోలీసు ప్రజా భరోసా కార్యక్రమ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. నేరాలకు పాల్పడితే జైలు శిక్షలు తప్పవన్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ వీరరాఘవులు, ఎస్ఐ ఏడుకొండలు, పోలీస్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.



నూతనకల్ : మాట్లాడుతున్న ఎస్పీ నర్సింహ



సూర్యాపేటటౌన్ : చట్టాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఐకేపీ కొనుగోలు కేంద్రాల వద్ద వసతులు కల్పించాలి

చివ్వెంల(సూర్యాపేట) : ఐకేపీ కేంద్రాల వద్ద రైతులకు మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. బుధవారం చివ్వెంల మండలం ఐలాపురం గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. కొనుగోలులో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులదే అని అన్నారు. వేసవి దృష్ట్యా సెంటర్ల వద్ద తాగునీటితో పాటు, రైతులకు కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఏఓ బి.వెంకటేశ్వర్లు, నిర్వాహకులు పాల్గొన్నారు.

రైతులు మద్దతు ధర పొందాలి

రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అక్కలదేవిగూడెంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ సంతోష్‌కుమార్, ఏపీఎం సైదయ్య, సీసీలు వెంకన్న, ఉపేందర్ తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

అర్వపల్లి : మండల పరిధిలోని కొమటిపల్లి గ్రామంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీఓ టి.గోపి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం చేయాలని సూచించారు. అలాగే సూర్యనాయక్‌తండాలో ఉపాధి పనులను పరిశీలించి కూలీల హాజరు పట్టికను సరిచూశారు. అనంతరం కొమటిపల్లిలో పైప్‌లైన్ మరమ్మతులు పనులను పరిశీలించారు.



చివ్వెంల : ఐలాపురంలో ఐకేపీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జ్యోతిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ తేలు పరుషరాములు, నిర్వాహకులు, మేట్లు ఉన్నారు.

కుంచమర్తిలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

మండల పరిధిలోని కుంచమర్తి గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం మండల సీసీ నగేష్ ప్రారంభించారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉగ్గం ఉపేంద్రలింగరాజు, దుబ్బాక పద్మ, మన్నె లలిత, స్వరాజ్యం, కస్పరాజు మల్లమ్మ, పానగంటి రవి, మన్నె గోవర్ధన్, అలుగుబెల్లి లక్ష్మారెడ్డి, ఎండీ అమీనుద్దీన్, దనకొండ, కె.సైదులు, సుధాకర్‌రెడ్డి, ఉగ్గం రమేష్, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నూతనకల్ : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. నిర్వాహకులు రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని సూచించారు. ఆయన వెంట ఏడీఏ బాలకృష్ణ, ఏఈఓ జానయ్య, నిర్వాహకురాలు బండపల్లి గీత, రైతులు వెంకటయ్య, అశోక్, ఉపేందర్, లింగారెడ్డి ఉన్నారు.



నూతనకల్ : కొనుగోలు కేంద్రంలో రికార్డు పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ పీడీ అప్పారావు

నూతనకల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కొనుగోళ్లను వేగవంతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ అప్పారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. నిర్వాహకులు రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయకుండా తేమశాతం వచ్చిన ధాన్యాన్ని కాంటాలు వేసి సకాలంలో దిగుమతులు అయ్యే విధంగా చూసుకోవాలని అన్నారు. ఆయన వెంట ఏపీఎం రమణాకర్, కేంద్రం నిర్వాహకులు, రైతులు తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది



మద్దిరాల : పోషణ్ పక్వాడ కార్యక్రమంలో పాల్గొన్న తీగల గిరిధర్‌రెడ్డి

మద్దిరాల : గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరికి పౌష్టికాహారం అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అమీన్‌సింగ్, సీడీపీఓ శ్రీజ, మండల వైద్యాధికారిణి అమూల్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనురాధ, హెచ్ఎంలు శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, శివ, పంచాయతీ కార్యదర్శి స్వామి, ఏఎన్ఎం పల్లవి, అంగన్‌వాడీ టీచర్లు గుర్వోజు రమాదేవి, విజయలక్ష్మి, అంజలి, అన్నపూర్ణ, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను సద్వినియోగం చేసుకోవాలి

అర్వపల్లి : అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అర్వపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సీహెచ్.యాకలక్ష్మి కోరారు. బుధవారం స్థానిక పీఎస్ ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం ప్రదర్శించారు. కార్యక్రమంలో టీచర్లు రేణుక, శైలజ, నవనీత, సునంద, ఆయాలు స్వర్ణ, అరుణ, సిబ్బంది కొండల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి



గాయపడిన కూలీని పరామర్శిస్తున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

సూర్యాపేట అర్బన్ : ఆటో బోల్తాపడి మృతి చెందిన యాదమ్మకు ప్రభుత్వం రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, గాయపడిన కూలీలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సూర్యాపేట మండలంలోని టేకుమట్ల గ్రామానికి చెందిన 15మంది వ్యవసాయ కూలీలు బుధవారం ఆత్మకూర్ (ఎస్) మండలంలోని బొప్పారం గ్రామంలో మిరపతోట ఏరడానికి ఆటోలో వెళ్తుండగా కోటపహాడ్ గ్రామంలో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో మృతి చెందిన యాదమ్మ మృతదేహాన్ని, గాయపడి చికిత్స పొందుతున్న కూలీలను పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఐద్వా, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో కలిసి ఆమె సందర్శించి పరామర్శించారు. అనంతరం మల్లు లక్ష్మి మాట్లాడారు. తీవ్రంగా గాయపడిన మహిళలకు ప్రభుత్వం రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆశాలత, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు మల్లు నాగార్జునరెడ్డి, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల జ్యోతి తదితరులు ఉన్నారు.

నల్లాలకు అక్రమంగా అమర్చిన మోటార్ల సీజ్



సీజ్ చేసిన మోటార్లు

సూర్యాపేట అర్బన్ : పట్టణంలోని పలు నివాసాల్లో మున్సిపల్ నల్లాలకు అక్రమంగా అమర్చుకున్న మోటార్లను మున్సిపల్ అధికారులు బుధవారం సీజ్ చేశారు. పట్టణంలోని శ్రీరామ్‌నగర్, బాలాజీనగర్, శ్రీశ్రీనగర్‌లో రైడ్ నిర్వహించి 54మోటార్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. మున్సిపల్ నల్లాలకు నేరుగా మోటార్లు అమర్చి నీటిని వాడుకుంటే రూ.5వేల జరిమానాతో పాటు మోటార్లు సీజ్ చేసి నల్లా కనక్షన్ శాశ్వతంగా తొలగిస్తామని హెచ్చరించారు.

కేసు నమోదు

సూర్యాపేటటౌన్ : భూమి విషయంలో ఓ వ్యక్తిపై దాడి చేసిన కేసులో పలువురుపై కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట రూరల్ ఎస్ఐ బాలునాయక్ తెలిపారు. వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని గాంధీనగర్ సమీపంలో గల సర్వే నంబర్ 409, 410లో పట్టణానికి చెందిన న్యాయవాది కిశోర్‌కు భూమి ఉంది. ఆ భూమిలో తనకు తెలియకుండా సర్వే ఎలా చేస్తారని కిషోర్ వెళ్లగా అక్కడే ఉన్న బుచ్చిరాములు అనే వ్యక్తితో పాటు మరికొందరు అతడిపై దాడి చేశారు. ఈ విషయమై సూర్యాపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కిషోర్ ఫిర్యాదు చేయగా బుచ్చిరాములుతో పాటు మరో 20మందిపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ బాలునాయక్ తెలిపారు.

రామాలయంలో చోరీ

పెన్‌పహాడ్ : మండలంలోని మాచారం గ్రామంలో గల రామాలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ గోపికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయంలో పనిచేసే వెంకన్న రోజులాగానే ఉదయం ఆలయానికి వచ్చి చూడగా దేవాలయం బేడం పగులగొట్టి ఉండటాన్ని గమనించి అమ్మవారి మెడలో ఉన్న 8గ్రాముల బంగారు పుస్తే, 35గ్రాముల వెండి శతగోపం చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని ఆలయ చైర్మన్ బొల్లక బొబ్బయ్యకు తెలిపాడు. చైర్మన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం సంఘటన స్థలాన్ని సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ పరిశీలించారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం

సూర్యాపేట అర్బన్ : విద్యార్థుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని, తక్షణమే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని వీఎన్ భవన్‌లో ఏర్పాటు చేసిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయని, ఆ నిధులు విడుదల కాకపోవడంతో మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాల యాజమాన్యాలు ప్రాక్టికల్స్, పరీక్షలను నిర్వహించలేమని చేతులెత్తేశారని, రెండుసార్లు పరీక్షలు వాయిదా పడడంతో విద్యార్థులు ఆందోళనలో ఉన్నారన్నారు. స్కాలర్‌షిప్‌లు సకాలంలో విడుదల కాకపోవడంతో కళాశాల యాజమాన్యాలు ఫీజులు చెల్లిస్తేనే తరగతులు నిర్వహిస్తామని విద్యార్థులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని అన్నారు. ఈ నెల 24, 25, 26తేదీల్లో ఖమ్మంలో జరిగే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 5వ మహాసభలను విజయవంత చేయాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, జిల్లా ఉపాధ్యక్షుడు అక్కినపల్లి వినయ్, పులుసు శ్రవణ్‌కుమార్, తన్వేష్, గోపి, చంద్రశేఖర్, వెంకటేష్, అజయ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

పెన్‌పహాడ్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే విద్యా సంవత్సరానికి అధిక సంఖ్యలో విద్యార్థులను చేర్చుకొనుటకు పాఠశాల హెచ్ఎం అధ్యక్షతన పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఏడు టీమ్‌లుగా విభజించి ప్రతి టీమ్ వారికి కేటాయించిన గ్రామ, ఆవాస ప్రాంతాన్ని సందర్శించి ఇంటింటికి తిరిగి, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలను సేకరించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులను కలిసి వారితో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ రవి

అకాల వర్షంతో తడిసిన ధాన్యం



చివ్వెంలలో వరదనీరు రాకుండా ధాన్యం రాశికి అడ్డుకట్ట వేస్తున్న రైతు

చివ్వెంల : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసింది. కొనుగోలు కేంద్రాలలో రైతులకు టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో ధాన్యం కాపాడుకోలేని దుస్థితి ఏర్పడింది. దీనికి తోడు తూకం వేసిన ధాన్యం మిల్లులకు తరలించకపోవడంతో ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు వాపోతున్నారు.

దెబ్బతిన్న వరిపంట పరిశీలన

ఆత్మకూర్ (ఎస్) : మండలంలోని ఇస్తాలపురం, ముక్కుదుదేవులపల్లి గ్రామాల్లో ఇటీవల వడగళ్ల వానతో దెబ్బతిన్న వరిపొలాలను బుధవారం మండల వ్యవసాయ అధికారిణి దివ్య, ఆర్ఐ స్వప్న పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అకాల వర్షం, వడగళ్ల వానతో పంట నష్టపోయిన వివరాలను జిల్లా అధికారులకు నివేదిక ద్వారా అందజేస్తామని తెలిపారు. వారి వెంట ఏఈఓ లక్ష్మీప్రసన్న, రైతులు పాల్గొన్నారు.



వరిపంటను పరిశీలిస్తున్న అధికారులు

నూతన కమిటీ ఎన్నిక

సూర్యాపేట : పట్టణంలో ఆరెకటిక కుల మటన్ విక్రయదారుల సహాయ సహకార సంఘం సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కోయిల్‌కార్ నాగయ్య, గౌరవ అధ్యక్షుడిగా కామ్లేకర్ సంజీవ్‌కుమార్, గౌరవ సలహాదారులుగా టింగిల్‌కార్ శ్రీనివాసు, నారాయణజీ, ఉపాధ్యక్షులుగా జమాల్‌పురి బాలేశ్వర్, కార్యదర్శిగా సింకార్ చంద్రం, సంయుక్త కార్యదర్శిగా జమాల్‌పురి నరేష్, కోశాధికారిగా టింగిల్‌కార్ శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా శంకర్‌జీ, నర్సింహరావు, వినోద్‌కుమార్, సతీష్‌జీ, సాయి, భానుచందర్, నరేందర్‌జీ ఎన్నికయ్యారు.



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

బొడ్రాయి వార్షికోత్సవం

మద్దిరాల : మండలంలోని కుక్కడం గ్రామంలో బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు బొడ్రాయికి జలాభిషేకం చేసి పూజలు నిర్వహించారు. సాయంత్రం బొడ్రాయికి, మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న మహిళలు